36

# పులికూడు

అతను వెళ్లాలని అనుకోలేదు.

వస్తాడని వాళ్లూ అనుకుని వుండరు.

ఆ వూరికీ ఆ యింటికీ అతని రాక అనుకోని ఓ సంఘటన అయింది.

పుట్టిన ఊరు వదిలి పదిహేనేళ్లయింది. ఈ పదిహేనేళ్లలో ఎక్కడెక్కడ తిరిగాడో ఎన్ని అవస్థలు పడ్డాడో అతనికే ఎరిక. చివరకు స్థిరపడ్డాడు. తన కాళ్ల మీద తను నిలబడి బతుకుతున్నాడు. తను పుట్టిన వూళ్లోనే ఉన్నా, నాన్న కోరుకున్నట్లు బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో వున్నా సంపాయించలేనంతగా ఇప్పుడు సంపాయిస్తున్నాడు. అక్కడి మిత్రులు కూడా అతన్ని ఎంతగానో ఆదరిస్తున్నారు. అందుకే పుట్టిన ఊరూ, ఇల్లూ ఒదిలేసి, తోబుట్టువుల్ని కాదనుకుని, ఆ వున్నదే తన వూరనుకుని కష్టపడి పనిచేసుకు బతుకుతున్నాడు. తన వూరినీ, తన వాళ్లనీ పూర్తిగా మర్చిపోయేడు.

తన ఉనికి తన వాళ్లకు తెలీకూడదు. అదే అతను కోరుకున్నది.

అజ్ఞాతవాసం భద్రంగా సాగుతోందని అనుకుంటోన్న తరుణంలోనే ఒక సంఘటన జరిగింది. దానితో అతని గుట్టు బట్టబయలయింది.

అదీ కాకతాళీయంగా జరిగిందే!

బొంబాయినుంచి ఒక మిత్రుడు దుబాయ్ వెళ్తున్నాడు. అతన్ని సాగనంపటం కోసం విమానాశ్రయానికి వెళ్ళేడు. అక్కడ తన చిననాటి మిత్రుడొకడు కన్పించేడు. గేటులోనే అతను ఎదురయ్యేడు. తప్పించుకుని అతను లోపలికెళ్ళిపోయేడు. కాని, అతని మిత్రుడు మాత్రం వెళ్లిపోలేదు. మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చేడు. వచ్చి,

అతని ముందు నిలబడి

"నువు అప్పారావు వేనా?" అనడిగేడు.

"అవును. మీరెవరు?" అనడిగేడు అప్పారావు.

"నేన్రా! గుర్తుపట్టలా? కిష్టిగాడిని. కృష్ణారావునిరా" అన్నాడు కృష్ణారావు.

"అరె...."

ఇద్దరూ గాఢాలింగనంలో కల్సిపోయేరు.

"ఇక్కడున్నావేమిటి?" అనడిగేడు అప్పారావు.

"సౌదీలో వుంటున్నాను. ఇంటికి వెళ్తూ ఇక్కడ ఫ్లైట్ దిగేను" అని చెప్పాడు అప్పారావు బాల్య స్నేహితుడు.

ఇద్దరూ బాల్య స్నేహితులు మాత్రమే కాదు. సహాధ్యాయులు కూడాను. అంతకంటె మంచి అనుబంధం ఏమిటంటే, ఇద్దరూ ఒకేసారి ఎస్సెస్సెల్సీ తప్పేరు. తన తండ్రి కోరికను నెరవేర్చలేదనే ఆవేదనతో అప్పారావు వూరు విడిచి వెళ్లిపోయేడు. కృష్ణారావు మాత్రం వూళ్లోనే వుండిపోయేడు.

"స్వంత ఆస్తి వున్నా పరీక్ష పోయిందనే నెపంతో ఊరొదిలి వెళ్ళిపోయేవు. ఏమీ లేకపోయినా నేను ఊరిని పట్టుకు వేళ్ళాడుతున్నాను."

"ఇంకానా?"

"ఇప్పుడైతే కాదనుకో, ఏదో మీ నాన్న దయవల్ల పదివేలు అప్పు దొరికింది. అక్కడికి పోయి కష్టపడుతున్నాను."

"కష్టమా? డబ్బు సంపాదించుకోవటం కూడా కష్టమేనా?"

"నీకేం తెల్సు? రక్తం పీల్చేస్తారు వాళ్ళు. అక్కడ అన్ని అడ్డమైన పనులూ చేసి ఇక్కడికివచ్చిమాత్రం ఎక్కడ లేని దర్జా వెలగబెడతారు."

విమానం బయల్దేరుతున్నట్లు ప్రకటన వచ్చింది. అప్పారావు మిత్రుడు సెక్యూరిటీలోకి వెళ్ళిపోయేడు. ఇద్దరూ కాస్సేపు వుండి విమానం బయల్దేరేక బయటికొచ్చేరు.

"రూం కెళదాం పద"

"లేదురా. ఇంటి కెళ్ళాలి" అన్నాడు కృష్ణారావు.

"పెళ్ళయిందా?"

"ఊ... ఇద్దరాడపిల్లలు కూడాను."

"ఓ... అయితే వెళ్లాల్సిందే. తిరిగి వెళ్లేప్పుడు మాత్రం తప్పకుండా రావాలి."

"అలాగే"

ఇద్దరూ ఇండియన్ ఎయిర్ లైన్స్‌కి వెళ్ళేరు. ఆ రోజుకి ఇక హైదరాబాదు

విమానానికి ఖాళీ లేదన్నారు. ఒక రోజు అక్కడే వుండిపోవల్సివచ్చింది కృష్ణారావు. డాక్టరు చెప్పిందీ రోగి కోరిందీ ఒకటే అయింది.

మిత్రులిద్దరూ రూంకెళ్లారు.

"ఊరు వదిలేసేక ఏం చేసేవు?'' అనడిగేడు కృష్ణారావు.

"ఎన్నో అవతారా లెత్తేను. ఆఖరికి కూలిపని కూడా చేసేను. జీవితం ఎంత ఘోరమైన పోరాటమో ఇల్లు వదిలేకే తెల్సింది.''

"ఇంతకీ ఇప్పుడేం చేస్తున్నావు?''

"మూడు లేత్ మిషన్లున్నాయి. పెన్ను లకీ, ప్లాస్టిక్ సామాన్లకీ 'డై'లు తయారు చేసి ఇస్తూ వుంటాను. ఇప్పుడు నేను పది మందికి జీతాలిచ్చి పోషిస్తున్నాను'' అని చెప్పాడు అప్పారావు.

"ఇంటికెప్పుడైనా వెళ్ళేవా?''

"లేదు''

"పాపం! మీ అమ్మ పోయిందిరా. నువు కూడా పోయేవనే అనుకుంటున్నారంతా.''

"అందుకే మళ్లీ బతకదలుచుకోలేదు'' అన్నాడు అప్పారావు.

ఇది జరిగేక అప్పారావు బతికే వున్నట్లు ఊళ్లో అందరికీ తెల్సిపోయింది. అంతే కాదు అప్పారావు ఎడ్రస్ కూడా వాళ్ళ నాన్నకిచ్చేడు కృష్ణారావు.

కృష్ణారావువెళ్ళిన పది రోజుల్లోనే తండ్రి నుంచి ఉత్తరం వచ్చింది అప్పారావుకు. ఇంటికి రమ్మని అతన్ని ప్రేమతో పిలవలేదు. అలాగని రావద్దనీ వుత్తరంలో ఖచ్చితంగా రాయలేదు.

"నాయనా

నువు బతికే వున్నావని ఇంతకాలానికి తెల్సింది. అంతేకాదు, బాగా బతుకు తున్నావని కూడా తెల్సింది. చాలా సంతోషం. కాని, నన్ను ఒక్కటే విచారం పట్టుకు పీడిస్తున్నది. అది నువు ఇంట్లోనుంచి ఎందుకు పారిపోయావా అని. నిన్ను బాగా చదువుకోమన్నాను. చదువుకుని మంచి ఉద్యోగం చేయాలని కోరుకున్నాను. అంతేగాని పరీక్ష తప్పి ఇంట్లోంచి పారిపొమ్మని కోరుకోలేదు. నిన్ను తిట్టినా కొట్టినా ఆ పని చేయవచ్చు. అలాంటప్పుడు నువు వెళ్ళిపోయినా అంతగా పట్టించుకునే వాడిని కాదు. బాధపడే వాడినీ కాదు.

నువ్వు ఇల్లు విడిచేక ఎన్నో అనర్థాలు జరిగేయి. అవన్నీ ఇక్కడ ఏకరు పెట్టి నిన్ను బాధ పెట్టను. అలాగని మంచికూడా జరక్కపోలేదు. నువ్వు ఉన్నప్పటినాలుగు

ఎకరాల భూమీ ఇప్పుడు పన్నెండెకరాలైంది. ఉండటానికి మంచి ఇల్లు, చేతినిండా పనికల్పించే పొలమూ వున్నాయి. వాటి కోసం ఉన్న ఫళంగా అవన్నీ వదిలేసి వచ్చేయమని చెప్పటం లేదు. వచ్చినా నీకు ఏమీ లోటు ఉండదని మాత్రమే నా వుద్దేశం. ఇక నిన్ను చూడటం అంటావా? నువ్వు ఎప్పుడోపోయావనే అనుకుని గుండె బండ చేసుకున్నాను. కొత్తగా ఇప్పుడు చూడాలనే ఉబలాటం ఏమీ లేదు..''

ఇలాసాగింది ఉత్తరం. అందులో అప్పారావుని ఇంటికి రమ్మని స్పష్టంగా ఏమీ రాయలేదు. రావద్దనికూడా లేదు. ఇలా గోడమీది పిల్లి వాటంగా తండ్రి ఉత్తరం రాయటం అప్పారావుకేమీ నచ్చలేదు. అంచేతనే అటు వెళ్లే ప్రయత్నం చేయలేదు.

తల్లి లేనే లేదు. తండ్రి తనని చూడాలనే అభిలాష చూపించటం లేదు. అన్నగారు సరేసరి. అతని గురించి అసలు ఏమీ తెలీదు.

ఇంకెందుకు వెళ్లాలి?

కాని, ఇప్పుడు వెళ్లక తప్పదు.

'నిన్ను చూడాలని వుంది. వెంటనే బయల్దేరి రా' అని తండ్రి టెలిగ్రాం ఇచ్చేడు.

అందుకే ఈ ప్రయాణం.

పదిహేనేళ్ళ తర్వాత మళ్ళీ అటువైపు ప్రయాణం చేస్తూ వుండటంవల్ల మొట్ట మొదటి సారి వచ్చినఅనుభూతి ఇప్పుడు కలుగుతోంది. పోతే, అప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ప్రయాణ సౌకర్యాలు బాగా పెరగటంతో దూరం తరిగిపోయినట్టుగా అనిపించింది. ఒకప్పుడు బొంబాయివెళ్ళాలంటే ఖండాంతర యానంలా ఉండేది. నర్సాపురం నుంచి నిడదవోలు వరకూ ఒక బండి, అక్కడినుంచి హైదరాబాదు వరకూ మరో బండి. హైదరాబాదు నుంచి బొంబాయికి ఇంకో బండి. ఇలా మూడు అంచెలుగా ప్రయాణం చేయాల్సి వచ్చేది. మరిప్పుడో! సరాసరి నర్సాపురం నుంచి బొంబాయి వరకూ వెళ్లిపోవచ్చు.

నర్సాపురంలో రైలు దిగగానే అంతా కొత్తగా అనిపించింది. కాలం నిత్య పరిణామ శీలి అనేందుకు నిదర్శనాలు ఎన్నో కనిపించేయి. రిక్షాల స్థానంలో ఆటోలు వచ్చేయి. చిన్న చిన్న ఇళ్ళువుండే స్థలంలో పెద్ద పెద్ద మేడలు లేచేయి. రోడ్డుకి ఇరువైపులా అందమైన అంగళ్లు వెలిసేయి. రోడ్లమీద జన సందోహం కదలిక ముమ్మరంగా కనిపిస్తోంది. బొంబాయి మహానగరంలో మసిలిన అప్పారావుకి కూడా అదో అద్భుత పరిణామంగానే అవుపించింది.

ఇక తన వూరిలో ఎలాంటి మార్పులు వచ్చేయో!

రేవు దగ్గరికి వచ్చేప్పటికి ఈ పరిణామ ప్రభావం కొట్టవచ్చినట్లు కనిపించింది. రేవులో కాలికి మట్టి అంటే అవకాశం ఎక్కడా అవుపించలేదు. రేవులో నావలు తక్కువగా కన్పించేయి. లాంచీల రొద లేదు. ఇంతకు ముందు లాంచీలు వుండే స్థలంలో 'పంటి' వుంది. రేవులో రెండు పంట్లు వున్నట్లున్నాయి. మరోటి అవతల కూడా కనిపించింది. కార్లు, బళ్లు, స్కూటర్లు - అన్నీ అనాయాసంగా పంటి మీదికి ఎక్కిపోతున్నాయి.

'పంటు' అవతలికి వెళ్లటానికి సిద్ధంగా వుంది. కాని అప్పారావు అందులో ఎక్కలేదు. నావకోసం వెళ్లేడు. చేతిలో సూట్‌కేసూ అదీ చూసి గల్ఫ్ సరుకేమో అనుకుని సాదరంగా ఆహ్వానించేడు సరంగు.

"తెడ్డెయ్యక్కర్లేదు బావూ.. ఇంజను" అన్నాడు.

"అవతలికి వెళ్ళటానికి ఎంత?"

"ఎంత బాబు! ఒక అయిదు రూపాయలిప్పించండి తమరికి ప్రత్యేకంగా కడతాను" అన్నాడు.

నదివైపు చూస్తే ఒకసారి అంతా చుట్టి రావాలనిపించింది.

"పది రూపాయిలిస్తాను. అలా అయిదు తూముల వరకూ తీసికెళ్లి అవతల దింపుతావా?" అనడిగేడు అప్పారావు.

"అలాగే బాబు!"

తాడు లాగి ఏదో చక్రం గిర్రున తిప్పేడు అసిస్టెంటు కాబోలు ఒక కుర్రాడు. ఇంజను వెంటనే స్టార్టయింది.

పడవ ఐదు తూముల వైపు సాగింది. మోటారు మూలంగా నీటి వాలుకి ఎదురైనా చాలా సుళువుగా వెళుతోంది నావ. కుర్రాడు చుక్కాని దగ్గర కూర్చొన్నాడు. సరంగు హాయిగా కూర్చొన్నాడు.

సాంకేతిక ప్రగతి మనిషిని ఎంత సోమరిని చేస్తోంది? – అనుకున్నాడు అప్పారావు.

"ఏవూరు బాబూ మంది" అడిగేడు సరంగు.

చెప్పేడు.

"ఎక్కడినుంచొత్తన్నారేంటి?"

అదీ చెప్పేడు.

"అయితే తవరు ఇక్కడుండరన్న మాట!"

"ఊహు... పదిహేనేళ్లయింది, ఇల్లు వదిలి"

"అదీ సంగతి. అందుకే అంత ఇంతగా సూత్తన్నారన్నీను. ఇదేం వుంది బాబూ ఊళ్లోకెళ్లి చూడండి. డబ్బే డబ్బు! ఎక్కడ సూసినా మేడలే మేడలు!!"

"అంత డబ్బు ఎలా వస్తోంది?" అనడిగేడు అప్పారావు అయోమయంగా.

"అంతా కొయిటా సవుర్లే కదండి బాబూ! డబ్బుకేం కొదవ? పెళ్లాం అక్కడుంటే మొగుడిక్కడ. మొగుడక్కడుంటే పెళ్ళం ఇక్కడ. ఒకోసారి ఇద్దరూ అక్కడే వుంటారు. ఇంక ఆళ్ళ పిల్లల సంగతి సూడండి! దర్జా అంటే అల్లదే దర్జా అనుకోండి. ఒకొక్కడికీ ఒకో మోటారు సైకిలు. ఆ సైకిలెక్కి సినిమాలికీ షికార్లకీ తిరగటవే పని. ఆడపిల్లల్ని యేడిపించడం, లేకపోతే ఆల్లని యెనకాల కూకోబెట్టుకుని తిరగడం."

అతను చెబుతుంటే చాలావరకూ అక్కడి సామాజిక పరిస్థితి అర్థమైపోయింది అప్పారావుకు.

"మీకు తెలవదేమో! ఇంతకు ముందు మీ వూళ్ళో సదువుకున్న ప్రతి బాబూ ఇంజనీరో డాక్టరో అయ్యేవోడు. ఉప్పుడు సూడండి ఒక్కడూ పది దాటటంలేదు. సోకులు మాత్రం ... అబ్బో!!"

అతను అసూయతో చెబుతున్నాడో వాస్తవం చెబుతున్నాడో అర్థంకాలేదు అప్పారావుకు.

నావ ఐదు తూములు దాటి ముందుకు పోతోంది.

"ఇక తిప్పి అవతలి పక్కకి పోనీయ్" అన్నాడు అప్పారావు.

నావను నదికి అడ్డం వేసేడు సరంగు. అయిదు నిమిషాల్లోనే అవతలి కెళ్ళి పోయింది. రేవు వైపు మళ్ళించేడు నావను.

ఇంతకు ముందు సఖినేటిపల్లి లంకలో మనిషి ఎత్తున చెంగలి ఎదిగి నిత్య హరితంగా అవుపించేది. చాలా మంది స్త్రీలు గడ్డిమోపులతో పడవ దాటుతూండటం కద్దు. ఇప్పుడు గడ్డీ లేదు. స్త్రీలు అంతకంటే లేరు. అంతా కొబ్బరి చెట్లమయం.

గోదారి పూర్తిగా పాటుకు మళ్ళింది. నీటి వాలులో నావ ఇంజను వేగాన్ని మించి వెళుతోంది. ఇంతకు ముందు గోదారి పాటుకు మళ్ళినప్పుడు రేవులో దిగాలీ అంటే మోకాటి లోతు బురదలో దిగాల్సి వచ్చేది. ఫేంటు ఎగ్గట్టి, చెప్పులు చేత్తో పట్టుకుని మరీ దిగాల్సి వచ్చేది. ఇప్పుడు వొడ్డున సిమెంటు మెట్లు కట్టేరు. నావ దరికంటా హాయిగా వెళిపోతోంది.

"చాలా హాయిగా వుందే?" అన్నాడు అప్పారావు ఉత్సాహంగా.

"అంతా ఓయెన్జీసీ వోళ్ల సలవ బాబూ" అన్నాడు సరంగు.

"పెట్రోలు తవ్వివోళ్ళు. ఎక్కడ జూసినా ఆళ్ళే,ఆళ్ళ బళ్ళే! అందుకు అంతా సాపుగా చేసిపెట్టుకున్నారు."

చమురు వెదుకులాట సమాచారం అప్పారావుకు తెలుస్తోనే వుంది. కృష్ణా గోదావరి డెల్టా అంతా చమురు బావులతో నిండి వుందని, అక్కడ ఓ.యన్.జి.సి వారి పనులు చురుగ్గా సాగుతున్నాయని పేపర్లలో చదూతూనే ఉన్నాడు. కాని, ఆ పనులు ఈ ప్రాంతం రూపాల్నే మార్చేసాయని ఊహించలేకపోయేడు. ఓయన్జీసీ భౌతికంగానూ, గల్ఫ్ ఆర్థికంగానూ ఈ ప్రాంతాన్ని మార్చివేసేయన్న మాట!

నావ దిగి సిమెంటు మెట్లెక్కేడు.

సరంగుకి పది రూపాయలు ఇచ్చి వెనక్కి తిరిగేప్పటికి వాళ్ళ అన్నయ్య రామ్మూర్తి కనిపించేడు. అతను వాళ్ళన్నయ్యే అని రూఢిగా అనుకునేందుకు అప్పారావుకు ఆధారాలు చిక్కలేదు. కాస్సేపు నిలబడి ఏవోపోలికలు కూడబలుక్కుంటే తప్ప పోల్చుకో లేకపోయేడు. అంతగా మారిపోయాడు రామ్మూర్తి. అకాల వార్ధక్యం వచ్చి మీద పడినట్టుగా వున్నాడు.

కాస్సేపు పరికించి చూసి

"అన్నయ్యా!"అని పలకరించేడు అప్పారావు.

ఆ మాట వినగానే అమాంతం తమ్ముణ్ణి కౌగలించుకున్నాడు రామ్మూర్తి.

కుశల ప్రశ్నలు ముగిసేక

"ఏవిటన్నయ్యా ఇలా అయిపోయే"వని అడిగేడు అప్పారావు.

"నువు చూసి అప్పుడే పదిహేనేళ్ళయింది. అంత వయసూ మీద పడలేదా మరి".

"అలాంటి మార్పు కాదిది"

"మరెలాంటిది అంటావు?"

"నువు ఏదో మానసికంగా బాధపడుతున్నట్టున్నావు."

"అలాంటిది కూడా కొంచెం వుందనుకో."

"కొంచెం ఏవిటన్నయ్యా! ముఖం చూస్తే తెలీటంలా! అసలు నీకు మానసిక బాధ వుండాల్సిన అవసరం ఏం వుంది?"

"అన్నీ అవసరాన్ని బట్టి రావు. కొన్ని అవసరం లేకపోయినా వచ్చి మీద పడతాయి."

"ఏవిటి చెప్పు నీ బాధ?"

"ఏమని చెప్పను? ఈ స్థితిలో వేరే కాపురం అంటే మాటలా? నలుగురు పిల్లల్ని

పెంచిచదివించాలి. ముగ్గురు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేయాలి. ఇప్పుడా తండ్రి నీడ కింద ఏమీ తెలీకుండా బతికి పోతున్నాను. వేరుపడితే సాగుతుందా చెప్పు?"

"అసలు ఎందుకు వేరుపడాలి?"

"వేరు పడాలి అనే అభిప్రాయం నాది కాదు. మీ వదినది. నీకు రమ్మని టెలిగ్రాం ఇప్పించింది కూడా ఆమే. నాన్న కాదు."

"అయితే నాన్న నన్ను చూడాలని రమ్మన లేదన్నమాట!"

అప్పారావుకు మనసు చివుక్కుమన్నది. తండ్రి తన మీద బెంగపడి పిలిపించుకున్నాడని ఇంతవరకూ అనుకున్నాడు.

బస్సుకు వెళ్ళే సమయం ఆసన్నమైనట్టు హార్న్ వినబడుతోంది.

"సరే పద బస్సుకు టైమైనట్టుంది."

"బస్సెందుకు? మన గూడు బండి వుంది."

ఇద్దరూ బండి దగ్గరికెళ్ళేరు. బండి చాలా అందంగా వుంది. అది కేవలం ప్రయాణాల కోసమే తయారు చేయించినట్టుగా వుంది. మంచి రంగులు వేసి పూల రథంలా తయారు చేసేరు.

వీళ్ళనిచూడగానే పాలికాపు పరుగెత్తుకొచ్చి చేతిలోసూట్‌కేస్ అందుకున్నాడు. పెట్టె బండిలో పెట్టి గిత్తల్ని బండికి కట్టేడు.

"ఈ బళ్ళు ఇంకా వున్నాయన్నమాట!" అన్నాడు అప్పారావు.

"లేకేం? ఇదుగో మనలాంటి వాళ్ళదగ్గరే వున్నాయి. అందరూ వదిలేసిన దర్జాల్ని నాన్న చేస్తూ వుంటాడు. ఊళ్లో మోతుబరులంతా ఇలాంటివి ఎప్పుడో వదిలేశారు. అసలు పొలాలే అమ్ముకుని పట్నాలకి పోతున్నారు.

గిత్తల్ని బండికి కట్టేక

"ఎక్కండి" అన్నాడు పాలికాపు.

గిత్తల్ని ఒక్కసారి పరికించి చూసేడు అప్పారావు. ఒంగోలు గిత్తలు. బండి కంటే అందంగా వున్నాయి.

అప్పారావు బండిలోకి ఎక్కేడు. కింద పరుపు వేసినట్టున్నారు మెత్తగా వుంది. తర్వాత రామ్మూర్తి ఎక్కి వెనక వున్న చెక్క తలుపు పైకి లాగి బోల్టు పెట్టేడు.

అదిలించగానే గిత్తలు పరుగు తీసేయి.

"ఈ వరసన బస్సుకంటే ముందు మనమే వెళిపోయేట్టున్నాం" అన్నాడు అప్పారావు.

"మరేమనుకున్నావ్?" అన్నట్టు నవ్వేడు రామ్మూర్తి.

మువ్వల సవ్వడి చేసుకుంటూ పరుగెడుతున్నాయి గిత్తలు. వాటితో పాటే అప్పారావు ఆలోచన్లు కూడా పరుగెడుతున్నాయి. చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాలూ,చేసిన అల్లరి పనులూ అన్నీ అతని కళ్ళముందే గిర్రున తిరిగేయి. అలా తిరుగుతూ వుండగానే ఇంటిముందు ఆగింది బండి.

మువ్వల సవ్వడి విని పిల్లలు బయటికొచ్చేరు.

"ఇటురారా మురళీ"

కొడుకును పిలిచేడు రామ్మూర్తి. మురళి వెనకే ఇద్దరు ఆడపిల్లలూ వచ్చేరు.

"వీడు పెద్దాడు. పెద్దాడేవిట్లే వాడొక్కడే. వీళ్ళిద్దరూ ఆడపిల్లలు."

"తెలుస్తోనేవుంది కదా అన్నయ్యా." అన్నాడు నవ్వుతూ.

"మూడోది... ఏదిరా?"

"తాతయ్యకూడా వెళ్లినట్టుంది నాన్నా" అని చెప్పేడు మురళి.

"అయితే తాతయ్య ఇంట్లో లేరా?"

"ఊహు... పంచాయితీ ఆఫీసుకెళ్ళేడు."

"ఎందుకు?" అనడిగేడు అప్పారావు.

"ఎందుకేవిటి? ఆయన ప్రెసిడెంటుగా."

"అయితే నీ చిన్న కూతురు పంచాయితీ మెంబరా?" అన్నాడు అప్పారావు.

అందరూ నవ్వుకున్నారు.

ఇంతలో కాంతం కూడా బైటికొచ్చింది.

"ఏం బాబూ! బాగున్నావా?" అని పలకరించింది అప్పారావును.

"ఎవరన్నయ్యా! ఒదినేనా?" అనడిగేడు అప్పారావు.

"ఏం నాయనా అన్నగార్ని గుర్తు పట్టగలిగిన వాడివి నన్ను గుర్తు పట్టలేకపోయేవా?"

"అది కాదు వదినా! బాగా ఒళ్లొచ్చిందికదా ఎవరో అనుకున్నాను."

"పోన్లెండి, లోపలికి రండి."

అప్పారావు లోపలికెళ్లేడు. ఇల్లుకూడా ఇంతకు ముందులా లేదు. ఏవో మార్పులూ చేర్పులూ జరిగేయి. ఇల్లంతా నాపరాయి పరిపించేరు. గదులు పెద్దవైనాయి. అన్ని గదుల్లోనూ ట్యూబులైట్లున్నాయి. ఇంతకు ముందులా ధాన్యం గదిలో లేదు. బయట ధాన్యం కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసేరు.

ఇల్లంతా తిరిగి చూస్తూ వుంటే మళ్ళీ ప్రత్యక్షమైంది కాంతం.

"స్నానం చెయ్ నాయనా కాస్త బడలిక తగ్గుతుంది."

బయటికెళ్ళి కొడుకుని పిల్చింది.

"ఒరే మురళీ అలావెళ్ళికాస్త మోటార్ వేసిరానాన్నా. బాబాయ్ స్నానం చేస్తారు" అని చెప్పింది.

'ఈ మోటారు కథ ఏవిటో' అనుకుంటూవుండగానే 'కియ్యి'మని శబ్దం మొదలైంది.

"ఏవిటి వదినా అది"

"మోటారు నాయనా. నూతిలో నీళ్ళు చేదుకోలేక చేతులు పడిపోతున్నాయని మొరపెట్టుకుంటే మీ నాన్న గారు ఈ ఏర్పాటు చేశారు. సుఖంగా వుందనుకో ప్రాణం."

అంటే బాత్రూంలు కూడా ఉన్నాయన్న మాట! ఇక్కడ కూడా యీ ఎలుకల బోనుల్లోనే స్నానం చేయాలా? చక్కగా నూతి దగ్గర నీళ్ళు చేదుకుని స్నానం చేయటంలో వున్న హాయి కుళాయి కింద కూర్చుంటే వస్తుందా?

"నేను నూతి దగ్గరే స్నానం చేస్తానొదినా" అన్నాడు.

"ఎలా చేస్తావు నాయనా పైన జాలీతో కప్పేశారుగా."

ఇదొకటి. ఇక తప్పదురా భగవంతుడా అనుకున్నాడు.

ఈ పరిస్థితులు చూస్తో వుంటే జనపదాలు భ్రష్టు పట్టి పోయాయనే అనిపించింది అప్పారావుకు. నగరాల నుంచి దిగుమతి అయిన సంస్కృతి పల్లెల్ని కలుషితం చేస్తోందనేందుకు ఇదొక్కటే నిదర్శనం.

పల్లెటూళ్ళు నిజంగా అభివృద్ధి చెందాయా?

ఇది వాపే కాని బలుపు కాదేమోనని అనుమానం కలుగుతోంది అప్పారావుకు. ఊరు ఒదిలి వెళ్ళేక విచ్చుకుని, విశాలమైన అతని మనసుకి ఇవన్నీ గ్రామ జీవన రాగంలో అపస్వరాలుగా అనిపించేయి. సహజ ప్రకృతికి సంకెళ్లు వేసినట్టుగా అనిపించింది.

స్నానం చేసి భోంచేసేటప్పటికి వెంకట్రామయ్య గారు ఇంటికొచ్చేరు. ఎడం చేయి పిల్లన వేలు పట్టుకుని చిన్న మనవరాలు ఆయన్తోపాటే లోపలికొచ్చింది.

"బాగున్నావా నాన్నా?" అని పలకరించేడు అప్పారావు.

"ఆ... వచ్చావా? రావేమో అనుకున్నాను."

"నువ్వు రమ్మని టెలిగ్రాం ఇస్తే రాకుండా ఎలా వుంటాను నాన్నా?" అందామనుకున్నాడు అప్పారావు. కాని అప్పటికే లోపలికెళ్ళిపోయేడు వెంకట్రామయ్యగారు.

అప్పారావు గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్లు అనిపించింది. ఇంతకాలం తర్వాత ఇంటికొచ్చిన కొడుకుతో మాట్లాడే విధానం ఇదేనా? అంటే, ఆయనకి తనమీద ఏ మాత్రం ప్రేమ లేదన్న మాట! అనుకున్నాడు అప్పారావు.

మురళి వచ్చి అప్పారావు దగ్గర నుంచున్నాడు.

"పొలం చూసివద్దాం వస్తావా మురళీ" అనడిగేడు. ఎందుకో అక్కడ కూర్చోబుద్ధేయలేదు అప్పారావుకు.

అడిగిందే తడవుగా అప్పారావు చెయ్యి పట్టుకు లాగేడు మురళి 'వెళ్దాం పద' అన్నట్టు. కాని కాంతం ఎక్కడి నుంచి వచ్చిందో చటుక్కున ముందుకొచ్చి –

"ఇప్పుడు కాదులే ఎండ తగ్గేక వెళ్ళండి" అని ఆజ్ఞాపించింది కొడుకుని. వాడి ముఖంలో నిరుత్సాహం తొంగిచూసింది.

"నువు లోపలికెళ్ళు. బాబాయి కాస్సేపు పడుకుంటారు" అంది.

ఇష్టం లేకుండానే వెళ్ళిపోయేడు మురళి.

నడుం వాల్చేడు అప్పారావు. అతనికి తెలీకుండానే గాఢనిద్ర ఆవహించేసింది. అలా ఎంతసేపు నిద్రపోయేడో తెలీదు. లేచేప్పటికి నాలుగు దాటింది. లేచి ముఖం కడుక్కున్నాడు. అప్పటికే 'టీ' కప్పుతో వచ్చి అక్కడ నిలబడివుంది కాంతం.

టీ తాగి మురళిని వెంటబెట్టుకుని పొలం బయల్దేరేడు అప్పారావు.

"కొత్త పొలమా పాత పొలమా బాబాయ్" అనడిగేడు మురళి.

అదేవిటో బొత్తిగా అర్థం కాలేదు అప్పారావుకు.

"అంటే ఏవిట్రా?" అనడిగేడు.

"ఏమో! అలాగే అంటారు. తాతయ్య కొన్నది పాత పొలమట. నాన్న కొన్నదేమో కొత్త పొలమట."

"నాన్న కొన్నాడని ఎవరు చెప్పేర్రా?"

"అమ్మే"

కొంతవరకూ అర్థమైంది అప్పారావుకు.

"అయితే పాత పొలానికే పద" అన్నాడు.

పొలంలో కూడా యీ పదిహేనేళ్ళ వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. చాలా మార్పులు జరిగేయి. తాను చూసిననాటి కొబ్బరి చెట్లన్నీ ముదిరి ముసలివై పోయేయి. వాటి స్థానంలో నాటిన కొత్త చెట్లు అప్పుడే కాపుకొచ్చేయి. మామిడి చెట్టు అలాగే కన్పిస్తున్నా, అప్పట్లాగే విరగ్గాసినా, దాన్లో కూడా మార్పు కన్పిస్తోంది. అప్పుడు

ఉన్నన్ని కొమ్మలు లేవు. కొబ్బరి చెట్లకు ముసుగని కొట్టిపారేసేరో, లేక గాలికి విరిగిపోయేయో తెలీదు.

తోట మధ్యలో తను నాటిన పనస చెట్టుకన్పించింది.చాల ఆరోగ్యంగా పెరిగి కొమ్మలు విశాలంగా పరుచుకుంది. ఎవరో ఆత్మీయులు కన్పించినట్టు ఆ చెట్టు దగ్గరకు పరుగెత్తేడు అప్పారావు. అయిదారు కాయలు కాండానికి వేళ్ళాడుతున్నాయి. మొదల్నే పక్కానికి వచ్చిన రెండు కాయలున్నాయి. దగ్గరికెళ్ళి వాటిని తడివి చూసేడు అప్పారావు.

"ఊహూ..." అని తల ఆడించేడు.

"ఏమిటి బాబాయ్?" అనడిగేడు మురళి.

"కాయలు మీద గంట్లు ఎడం ఎడంగా వుంటే తొనలు పెద్దవిగా వుంటాయి" అని చెప్పాడు అప్పారావు.

"ఎలా వున్నాయి?"

"పెద్దగానే వున్నాయి. రుచిగా కూడా వుంటాయి."

"అయితే ఆ రెండు కాయలూ నువు తీసికెళ్ళు బాబాయ్."

"అవును. తీసికెళ్తే బావుంటుంది. అక్కడి వాళ్ళకు పనస పండు రుచి తెలీదు."

పొలం అంతా తిరిగి చూసేప్పటికి చీకటి పడిపోయింది. ఆ రోజు ఇక ఊళ్ళోకెళ్ళి ఎవర్నీ కల్సుకోలేక పోయేడు.

రాత్రి భోజనాలయ్యేక అన్నదమ్ములిద్దరూ చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు.

"పొలం అంతా తిరిగి చూసేవా?" అనడిగేడు రామ్మూర్తి.

"నువు కొన్న పొలం వెళ్ళనేలేదు. సమయం చాల్లేదు."

"నేను కొన్న పొలమా? అలాగని ఎవరుచెప్పేరు?"

"మురళి"

"ఓహో..." అన్నాడు అంతే. ఆ తర్వాత మాటల్లేవు.

రాత్రి పది గంటలైంది. పిల్లలందరూ నిద్రపోయేరు. అన్నా వదినా కూడా తమ గదిలోకి వెళ్ళిపోయేరు.

బయటికి వెళ్ళాడు అప్పారావు. తమ ఇంటికి అటూ ఇటూ చేలున్నాయి. దాళవా పంట తర్వాత చేలలో పిల్లి పెసర వేసినట్టున్నారు. బాగా పెరిగింది.

అప్పటికే ఊరంతా గాఢ నిద్రలోకి జారిపోయినట్లు అనిపించింది అప్పారావుకు. దూరంగా వున్న రోడ్డుమీదనుంచి బస్సో, లారీయో - వెళ్ళిన శబ్దం వినిపించింది. ఆ తర్వాత నీరవ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో చేలలోంచి విన్పించే కీచురాళ్ళ కోరస్

భయంకరంగా వుంది. వీధిలో దీపాలు కూడా కునికి పాట్లుపడుతూ వెలుగుతున్నాయి.

నిద్ర వస్తున్నట్టుగా అనిపించింది అప్పారావుకు. పడుకోవాలని లోపలికెళ్ళాడు. మంచం మీద కూర్చొన్నాడు. ఇంతలో బయటి నుంచి తండ్రి పిలుపు వినిపించింది.

లేచి వెళ్లేడు.

"అలా చావిట్లోకి రా"

వెంకట్రామయ్యగారు ఎప్పుడూ చావిట్లోనే పడుకుంటాడు.

అప్పారావు వెళ్ళేప్పటికి పక్కమీద కూర్చొని వున్నాడు వెంకట్రామయ్య గారు. మంచం మీద చిన్న మనవరాలు నిద్రపోతూవుంది.

"అలా కూర్చో"

ఎదురుగా వున్న పాత కాలంనాటి కుర్చీ చూపించేడు. అందులో సర్దుకుని కూర్చొన్నాడు అప్పారావు. కూర్చొన్న చాలా సేపటివరకూ ఎవరూ మాట్లాడలేదు. చివరకు అప్పారావు-

"ఏవిటి నాన్నా?" అని అడిగేడు.

చాలా సేపు మౌనం తర్వాత అన్నాడు వెంకట్రామయ్య గారు.

"జీవితంలో ఊహించని పని చేయాల్సి వస్తోంది".

"ఏవిటి నాన్నా అది?"

"నిన్ను టెలిగ్రాం ఇచ్చి రప్పించింది ఎందుకో తెల్సా?"

"ఎవరు? నువ్వేనా?" తెల్సినా అడిగేడు అప్పారావు.

"నేను కాదు. నేను ఇచ్చినట్టే వున్నా, ఇచ్చింది నీ వదిన"

"ఎందుకట?"

"అదే చెప్పబోతున్నాను..." అని కాస్సేపాగి

"... భూమి పంచెయ్యమని పోరు పెడుతోంది."

"నా బతుకేదో నేను బతుకుతున్నాను. భూమి అంతా వాళ్ళదేగా. ఇంకా యీ పంపకాల భాగోతం ఎందుకు?" అన్నాడు అప్పారావు.

"నువ్వు బతికి వున్నావని తెలియనంతకాలం అంతా తనదే అనుకున్నది. నువు ఉన్నావని ఎప్పుడైతే తెల్సిందో అప్పట్నుంచే దాని గుండెల్లో రాయి పడింది."

"అలాంటప్పుడు నన్ను రప్పించడం ఎందుకు."

"అందులోనే వుంది రహస్యం. అది అందరితోనూ ఏం చెప్పుకుంటుందో తెల్సా? నువ్వు ఉన్నప్పటి నాలుగుఎకరాలే ఉమ్మడి భూమిట. తక్కిన భూమి అంతా తన మొగుడి రెక్కల కష్టంమీద కొన్నది కాబట్టి వాడికే చెందాలిట. అది తేల్చుకోటానికే నిన్ను రప్పించింది."

"అన్నయ్య ఏమంటాడు?"

"వాడో వాజమ్మ. పెళ్లాం చేతిలో కీలుబొమ్మ. వాడికి ఇష్టం లేకపోయినా పెళ్లం ఆడించినట్టల్లా ఆడుతాడు."

అప్పారావుకు విషయం అంతా అర్థమైంది. చాలాసేపు ఆలోచించేడు. ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేడు.

"ఇప్పట్లో పంపకాలు అంత మంచిదికాదు నాన్నా" అన్నాడు.

"ఏం? ఎందుకని?"

"అన్నయ్యకు పిల్లలున్నారు. వాళ్ళ చదువులూ పెళ్ళిళ్ళూ ఉమ్మట్లోనే జరగాలి."

"అలా అనటానికి నువ్వెవడివిరా? ఆ జ్ఞానం దానికుండాలి."

"ఆమెకు లేకపోతే పోయే. మనకైనా ఉండాలిగా. వేరుపడితే అన్నయ్య ఈ భారాన్ని మొయ్యలేడు."

"అని నువ్వనుకుంటున్నావు. నీ వొదిన అలా అనుకోవటంలేదు. పంపకంలో పదెకరాలూ వచ్చేస్తే అదేమంత కష్టం కాదనుకుంటోంది."

"అది ఆమె అజ్ఞానం."

"అలా అనుకోవడం నీ అజ్ఞానం."

"పోతే పోనీ నాన్నా. అంతా వాళ్ళనే అనుభవించనియ్యి. వాళ్ళుమాత్రం పరాయి వాళ్ళా? నా మట్టుకు నేనేదో సంపాదించుకుంటూనే వున్నాను. నాకు పెళ్లామా? పిల్లలా?"

"ఇక ముందు కూడా వుండరా?"

"వుంటే నా సంపాదన లేదా? ఇంక ఆ ప్రస్తావన తేవద్దు నాన్నా. వెధవ భూమి గురించి మనసులు పాడుచేసుకోవడం మంచిదికాదు. ఈ వయసులోనైనా ప్రశాంతంగా బతకండి."

"ఇంకేం ప్రశాంతంరా. నువు చెప్పినట్టే గనుక చేస్తే నాకు అశాంతి అప్పట్నుంచే ప్రారంభమౌతుంది. అసలు ఈ ఇంట్లో వుండే అర్హతనే కోల్పోవచ్చేమో!"

"అలా ఎన్నటికీ జరగదు. అన్నయ్య అలాంటి వాడు కాదు. ఒకవేళ అలా జరిగితే నేను వుండనే వున్నాను."

"నువు వుండాలనే న్యాయంగా పంచాలంటున్నాను. పెద్దవాడుగా నా బాధ్యత నేను నెరవేర్చాలి."

"వద్దు నాన్నా"

"నీ మంకు పట్టే గానీ నేను ఎందుకు చెబుతున్నానో ఆలోచించవా? కావాలంటే

నీ వాటా కూడా నీ అన్నకే ఇచ్చుకో. కానీ, పంపకాలు మాత్రం జరగాలి. సగం భూమి నీ పేరున రాయటం నా బాధ్యత."

"వద్దు నాన్నా. ఆస్తిని ముక్కలు చేయకండి. కావాలంటే కాగితం రాసిస్తాను. ఆస్తిలో భాగం అక్కర్లేదని"

"అంతేనా"

"అంతే! ఇంకేమీ చెప్పద్దు."

అక్కడినుంచి లేచి వెళ్ళిపోయేడు అప్పారావు.

"నీకర్మ" అనుకున్నాడు వెంకట్రామయ్యగారు.

అప్పారావు అటు వెళ్ళగానే నడుం వాల్చేడు వెంకట్రామయ్యగారు. అప్పారావు కూడా పక్కమీద వాలేడు. కాని, ఇద్దర్లో ఎవరికీ నిద్దర లేదు. ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

తెల్లవారటానికి ఇంకెంతో సమయం లేదు.

అప్పారావుకు మాగన్నుగా నిద్ర పట్టింది. ఎవరో తల నిమురుతూ వుంటే మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూసేడు అప్పారావు. రామ్మూర్తి తన పక్కన కూర్చొని తల నిమురుతున్నాడు.

"ఏవిటన్నయ్యా?" అనడిగేడు అప్పారావు లేచి కూర్చొని.

"నువు వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళిపో తమ్ముడూ" అన్నాడు.

"ఎందుకని?"

"అదేమీ అడక్కు వెంటనే వెళ్లిపోయి నీ ప్రాణం దక్కించుకో. లేకుంటే నువు నాకు దక్కవు."

ఆ మాట కాస్తా అనేసి విసురుగా వెళ్ళిపోయేడు రామ్మూర్తి.

రామ్మూర్తి మాటలకు భయపడలేదు అప్పారావు. కానీ, తన ప్రాణాలు తీసేంత వరకూ ఎందుకు వచ్చిందో అతనికి అర్థం కాలేదు.

వెళ్ళి చావిట్లో తండ్రికి ఎదురుగా వున్న కుర్చీలో తెల్లవారే వారకూ కూర్చొన్నాడు. వెంకట్రామయ్యగారు లేవగానే-

"నాన్నా! ఈ ఆస్తి వ్యవహారం ఇవాళే తేలిపోవాలి. ఎలాగో తెల్పా?"

"చెప్పు. నీవెలా చెబితే అలా చేస్తాను" అన్నాడు వెంకట్రామయ్యగారు.

"పాత పొలం నాలుగెకరాలూ మీ పేరు మీదనే వుండాలి. మిగిలిన ఎనిమిదెకరాలూ చెరి సగం పంచి కాగితాలు రాయించెయ్యండి" అన్నాడు.

*(ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక **1994**)*